సాక్షి
పెద్దపల్లి
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



మల్లన్న సన్నిధిలో పట్నాలు

ఓదెల: మల్లన్నస్వామి ఆలయంలో సామూహిక పట్నాలు వేశారు. జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి పట్నాలు వేశారు. బోనం నైవేద్యంగా సమర్పించారు.



33 స్టేషన్లు.. 10 బోగీలు

నలభై ఏళ్లక్రితం సింగరేణి కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సింగరేణి రైలు 33 రైల్వేస్టేషన్ల ప్రయాణికులను 10 బోగీలతో గమ్యస్థానాలకు చేర్చుతోంది. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్: ఎన్నికల కమిషన్ నిబంధనలు పకడ్బందీగా పాటిస్తూ జాబితా పూర్తి చేయాలని కలెక్టర్ సంగీత తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి కలెక్టర్లతో ఓటర్ జాబితాలో ఎఫ్ఎల్‌సీ, పీఈటీ తొలగింపు, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారుల నియామకానికి మూడు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తూ సప్లిమెంటరీ ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో అనుమానాలు సృష్టించేలా సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టేలా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో సోషల్ మీడియా బృందాలను నియమించాలని అన్నారు. జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శనివారం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాలో మార్పులు, ఎన్నికల కమిషన్ సూచనలు వివరించాలన్నారు. సింగరేణి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.నరసింహమూర్తి, డీటీ ప్రవీణ్ పాల్గొన్నారు.

ధాన్యానికి నిప్పు పెట్టిన రైతులు



ధాన్యానికి నిప్పు అంటించిన రైతులు

సుల్తానాబాద్‌రూరల్: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయడం లేదని ఆగ్రహించిన రైతులు మండలంలోని కదంబాపూర్‌లో బుధవారం ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టినా.. నిర్వాహకులు కొనడం లేదని, ఇప్పటికే వర్షానికి తీవ్రంగా నష్టపోయామని, ఇప్పుడు కొనకుంటే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రైతులు గొస్కుల సదయ్య, మల్లయ్య, తిరుపతి, కొంరయ్య, రాజయ్య, కనకయ్య తదితరులున్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు కంటి పరీక్షలు చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలంలోని జేఎన్‌టీయూ విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. కళాశాలలో ప్రారంభించిన కంటివెలుగు క్యాంపును బుధవారం పరిశీలించారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. నోడల్ అధికారి సుధాకర్, వైద్యులు ప్రదీప్‌కుమార్, డీఈవో దండె కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

మే 2న అక్షయ టౌన్‌షిప్ ప్లాట్ల వేలం

సుల్తానాబాద్ : జిల్లాలోని అంతర్గాం గ్రామంలో ఉన్న రాజీవ్ స్వగృహ అక్షయ టౌన్‌షిప్ ఓపెన్ ప్లాట్లను వచ్చేనెల రెండో తేదీన వేలం వేయనున్నట్లు పెద్దపల్లి ఆర్డీవో కె.వెంకటమాధవరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. అక్షయ టౌన్‌షిప్‌ను 17.08 ఎకరాల్లో డీటీసీపీ లేఅవుట్‌తో ఇళ్లు నిర్మించారని, మొదటి దశ 78 ప్లాట్లకు వేలం వేశామని, మిగిలిన 22 ప్లాట్లకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు అక్షయ టౌన్‌షిప్‌లోగానీ.. దరఖాస్తు ఫారం ద్వారా రూ.10వేల డీడీ తీసి పెద్దపల్లి కలెక్టర్ పేరున పంపించాలని సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ సూపరిటెండెంట్ పుష్పలత, అంతర్గాం తహసీల్దార్ వేణుమాధవ్, ఈడీఎం కవిత, రాజీవ్ స్వగృహ ఏఈ చిరంజీవి పాల్గొన్నారు.

కిక్కివ్వని మందు

వైన్‌షాపుల సరుకు దారిదోపిడీ చేస్తున్న డ్రైవర్లు

- లోడుకు 15 వరకు ఫుల్‌బాటిళ్లు నీళ్లతో కల్తీ
- వినియోగదారులు తాగేది నీళ్ల మందేనా?
- కిక్కు రాక పరేషాన్ అవుతున్న మద్యంప్రియులు
- ఉమ్మడి జిల్లాలో తూతూ మంత్రంగా నౌకర్‌నమా!
- లోడుకు రూ.10 వేల చొప్పున రూ.లక్షన్నర వరకు స్వాహా
- మొత్తం విలువ ఏడాదికి రూ.5 కోట్ల పైమాటే..!

'ఫిబ్రవరిలో తీగలగుట్టపల్లిలోని ఓ షాపునకు వెళ్లే లోడు మందులో నీళ్లు కలిపారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో నీళ్లు కలిపిన మందుబాటిళ్లు పట్టుబడ్డాయి. పరీక్షల్లో మద్యంలో నీళ్లు కలిపారని తేలింది. వాస్తవానికి షాపు యజమానికి ఈ వ్యవహారంతో సంబంధం లేదు. మార్గమధ్యలో డ్రైవర్లు, సిబ్బంది కలిసి ఈ కల్తీకి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. అయినా.. సరుకు షాపులో దొరికింది కాబట్టి దీనిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు, యజమానికి జరిమానా కూడా విధించారు.

గతవారం కరీంనగర్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఐఎంఎల్ డిపో నుంచి గంగాధరకు బయల్దేరిన వాహనం మానేరు డ్యాం కట్ట సమీపంలో నీళ్లు కలుపుతుండగా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ విషయంలో ఆఫీసర్ల కంటే రెండాకులు ఎక్కువే చదివిన డ్రైవర్.. వెంటనే సరుకు వారి చేతికి చిక్కకుండా సీసాలన్నీ రోడ్డు మీదే పగులగొట్టాడు. చేసేది లేక వాహనాన్ని మాత్రమే సీజ్ చేసి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు కాలేదని తెలిసింది.

తరచుగా తీగలగుట్టపల్లిలోని బెల్టుషాపులో మందు తాగే ఓ వ్యక్తికి రుచిలో తేడా వచ్చింది. ఇదేంటి? తాను తాగిన మందు ఎక్కడం లేదని షాపు నిర్వాహకులతో గొడవకు దిగాడు. తమకేం సంబంధం లేదని.. వచ్చిన సరుకును అమ్ముతున్నామని బెల్టుషాపు నిర్వాహకుడు చెప్పాడు. సిరిసిల్ల, సుల్తానాబాద్, పెద్దపల్లి, జగిత్యాల గంగాధర మండలంలో తాము కొన్న మందు పలుచగా ఉందని కొందరు మందుబాబులు తరచుగా ఫిర్యాదులు చేస్తున్నారు. మొత్తానికి తాము తాగే మందు గతంలోలా కిక్కు ఇవ్వడం లేదన్నది వారి వాదన. ఒకరిద్దరు అంటే ఏమో అనుకోవచ్చు కానీ, పదే పదే మందు బాబులు ఇదే ఫిర్యాదు రావడం వెనక ఏం జరుగుతోంది? అన్న విషయంపై 'సాక్షి' పరిశోధనలో పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి.



మద్యం కల్తీ చేస్తున్న డ్రైవర్ (ఫైల్)

సరిగా అమలుకాని నౌకర్ నమా..!

వాస్తవానికి ఐఎంఎల్ డిపో.. తమకు వచ్చిన ఆర్డర్ పరంగా సరుకును వాహనాల్లోకి ఎక్కిస్తారు. అంతవరకు వీరి బాధ్యత. తరువాత మద్యం కల్తీ జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ చాలా కాలంగా నౌకర్‌నుమాను ప్రవేశపెట్టింది. అంటే సరుకును షాపు వరకు తీసుకువచ్చేందుకు ప్రతీ షాపు నుంచి ముగ్గురు సిబ్బందికి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అనుమతి ఇస్తుంది. సరుకు ఐఎంఎల్ డిపో నుంచి వైన్‌షాపు చేరేవరకు వీరిదే పూర్తి బాధ్యత. కానీ.. ఉమ్మడి జిల్లాలో ఈ విధానం సరిగా అమలు కావడం లేదు. వైన్ షాపు యజమానుల్లో చాలామంది తాము ఎంపిక చేసిన నౌకర్ నమాలను వాహనంతోపాటు పంపడంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారు. దీంతో మార్గమధ్యలో వాహనంలో ఉన్న సిబ్బంది నీళ్లు కలిపిన మందును షాపులకు, బెల్టుషాపులకు చేరవేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ఐఎంఎల్ డిపో నుంచి దాదాపుగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని వైన్‌షాపులకు మందు సరఫరా జరుగుతుంటుంది. ఈ డిపో నుంచి రోజుకు 20 నుంచి 30 వరకు సరుకు లోడ్లు వెళ్తుంటాయి. సరుకును క్షేమంగా షాపుల్లోకి చేర్చాల్సిన కొందరు వాహనాల డ్రైవర్లు, సహాయకులు, సరుకు దించే వారు కుమ్మక్కవుతున్నారు. వాహనాన్ని ఏదైనా నిర్మానుష్య ప్రాంతంలో నిలిపివేసి ఎవరూ చూడకుండా సీల్ చెదరకుండా ఫుల్ బాటిల్ (750 ఎంఎల్ నుంచి 1000 ఎంఎల్) ఓపెన్ చేసి అందులో క్వార్టర్ (180ఎంఎల్ నుంచి 200 ఎంఎల్) వరకు మందును వేరే బాటిళ్లలో నింపుతున్నారు. అనంతరం అదే స్థాయిలో నీటిని పోసి తిరిగి సీల్ వేసి షాపులకు వెళ్లాల్సిన సరుకులో కలుపుతున్నారు. వాటిని అప్పటికే సిద్ధం చేసిన అవే బ్రాండు బాటిళ్లలో నింపి, బెల్టుషాపులకు ఎంతో కొంతకు విక్రయిస్తున్నారు. అక్కడ వాళ్లు ఇంకొన్ని నీళ్లు కలిపి రాత్రీ పగలు తేడా లేకుండా అమ్ముతున్నారు. ఈ లెక్కన మార్గమధ్యంలో, కొన్ని వైన్‌షాపుల్లో, దాదాపుగా అన్ని బెల్టుషాపుల్లో మద్యంలో నీళ్లు కలుపుతున్నారు. ఇది తెలియని వినియోగదారులు ఎంత తాగినా తమకు కిక్కు రావడం లేదని నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంటుకు పలు ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. దీంతో ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దీనిపై కొన్ని నెలలుగా నిఘా ఏర్పాటు చేసింది.

రోజుకు రూ.లక్షకు పైగానే సరుకు స్వాహా..!

ప్రతిరోజూ ఎంతలేదన్నా.. 20 నుంచి 30 వరకు సరుకు వాహనాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరకు డెలివరీ చేస్తాయి. డ్రైవర్లు తలచుకుంటే.. ప్రతీ లోడుకు 15 నుంచి 20 బాటిళ్లు, ప్రతీ ట్రిప్పుకు కల్తీ చేసే అవకాశం ఉంటుంది. సగం లోడు వాహనాల్లో కల్తీ జరిగినా.. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు సరుకు కల్తీ అవుతోందన్నది ఎక్సైజ్ వర్గాల సమాచారం. ఇది నెలకు రూ.45 లక్షలుగా, ఏడాదికి దాదాపుగా రూ.కోటి నుంచి రూ.5.40 కోట్లకుపైగా సరుకును స్వాహా చేస్తున్నారని ఓ ఎక్సైజ్ అధికారి అభిప్రాయపడ్డారు.

భావితరాలకు దిక్సూచి 'జిల్లా సమగ్ర స్వరూపం'

- ఆవిష్కరణలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి, రచయితలు

సుల్తానాబాద్: జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకం భావితరాలకు దిక్సూచిగా పనిచేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా రచయితలతో రూపొందించిన సమగ్ర స్వరూపం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ భౌగోళిక స్వరూపం రీత్యా వనరులు, చారిత్రక కట్టడాలు, జలవనరులు, సిమెంట్, బొగ్గు తదితర అంశాల్లోనూ అన్ని జిల్లాలకు ఆదర్శంగా పెద్దపల్లి జిల్లా నిలుస్తోందన్నారు. వాటిన్నిటినీ కలిపి రచయితలు 400 పేజీల పుస్తకాన్ని తయారు చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గాజోజు నాగభూషణం మాట్లాడుతూ ఇక్కడి సాహిత్యం ఎల్లలు దాటిందని, అల్లం రాజయ్య, నారాయణ, వీరయ్య మొదలు ఆధునిక సాహితీవేత్తలు, చరిత్రకారులు వందలాది కథలు, కవిత్వాలు, నవలలు రాశారని పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, కోర్‌కమిటీ సభ్యులు బుర్ర తిరుపతి, కోర్ కమిటీ కన్వీనర్ కూకట్ల తిరుపతి, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, వేల్పుల నారాయణ, నారదభట్ల అరుణ, కవులు, రచయితలు పాల్గొన్నారు. పుస్తకానికి రచనలు అందించిన కవులు, రచయితలను ఎమ్మెల్యే సత్కరించారు.

ఈదురుగాలులకు మామిడికి తీవ్ర నష్టం

- తోటలను సందర్శించిన ఉద్యానవన అధికారులు



రాలిపోయిన కాయలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

ధర్మారం: మండలంలో రెండురోజులుగా ఈదురుగాలులతో కూడిన అకాలవర్షానికి మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. మామిడి తోటలను బుధవారం ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జగన్మోహన్‌రెడ్డి, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, ప్రజాప్రతినిధులు సందర్శించారు. కటికెనపల్లి, ఖిలావనపర్తి, బొట్లవనపర్తిలో ఈదురుగాలులకు నేలరాలిన తోటలను పరిశీలించారు. మామిడి నష్టంపై అంచనాలను సర్వే నంబర్ల వారీగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు బలరాంరెడ్డి తెలిపారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు రైతులకు పరిహారం అందేలా అధికారులతో నివేదికలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఉద్యానశాఖ మండల అధికారి జ్యోతి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, సర్పంచులు సాగంటి తారకొండయ్య, సూరమల్ల శ్రీనివాస్, జంగిలి గట్టుస్వామి, కీసర స్వరూపస్వామి, సామంతుల లచ్చయ్య, చేపూరి లచ్చయ్య, ముత్యాల వీరస్వామి పాల్గొన్నారు.

మిల్లర్లు ధాన్యం కొనాలని రైతుల ఆందోళన



సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

సుల్తానాబాద్: తమ ధాన్యాన్ని స్థానిక రైస్‌మిల్ యాజమాన్యాలు మద్దతు ధరకు కొనాలని మండలంలోని కదంబాపూర్ రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. తమ గ్రామ శివారులో పది వరకు రైస్‌మిల్లులు ఉన్నాయని, తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఉన్నా.. మిల్లర్లు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ప్రతి మిల్లు పది లారీల ధాన్యం కొనుగోలు చేసి తమకు సహకరించాలని కోరారు. ఇప్పటికే అకాలవర్షాలతో అవస్థ పడుతున్నామని, మిల్లర్లు ముందుకొచ్చి ధాన్యం కొనాలని పేర్కొన్నారు. రైస్‌మిల్లులతో దుమ్ము, ధూళి, బూడిద, ఊక, లక్క పురుగులు, మురుగునీరు, దుర్వాసన వస్తున్నా.. అధికారులకు ఫిర్యాదు చేయడం లేదని, ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే కళ్లల్లో దుమ్ము పడుతూ ప్రమాదాల బారిన పడినా ఎవరినీ బాధ్యులను చేయడం లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ ఇబ్బందులను గుర్తించి స్థానిక మిల్లులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు వినతిపత్రం అందించారు. రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు గోస్కుల సదయ్య, నాయకులు లెక్కల శంకర్ రెడ్డి, నల్లవెల్లి ఆగయ్య, కర్రె గట్టయ్య, బుచ్చయ్య, అంజయ్య, బీరయ్య, కొమురయ్య, తిరుపతి ఉన్నారు.

కేంద్రానివి కార్మిక వ్యతిరేక విధానాలు



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

గోదావరిఖని: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన సీపీఐ ప్రజాచైతన్య యాత్ర బహిరంగ సభలో మాట్లాడారు. ముందుగా బల్దియా కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ప్రధాన చౌరస్తా వరకు పాదయాత్ర ర్యాలీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీని గద్దెదించి దేశాన్ని రక్షించాలనే నినాదంతో ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేటీకరిస్తూ అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్తున్నారని విమర్శించారు. ఏకపక్ష నియంతృత్వ పాలనతో ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభాలకు గురిచేస్తోందన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ నాయకులు కలవేన శంకర్, తాండ్ర సదానందం, మద్రి వెంకటస్వామి, పవన్, సురేశ్, వేణు, గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, కనకరాజు, ఆరెల్లి పోశం తదితరులు పాల్గొన్నారు.

కులమతాల చిచ్చు పెడుతున్న కేంద్రం

సుల్తానాబాద్: కార్పొరేట్ శక్తులకు తలొగ్గుతున్న బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెడుతోందని చాడ విమర్శించారు. ప్రజాచైతన్య యాత్ర జిల్లా కేంద్రానికి చేరిన సందర్భంగా మాట్లాడారు. దేశాన్ని లౌకికవాదం నుంచి మతతత్వంగా మార్చేందుకే కుట్ర పన్నుతోందని పేర్కొన్నారు. యాత్రకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణలో అధికారంలోకొస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో ప్రమాదం

- బాయిలర్‌పై నుంచి పడి అధికారి మృతి
- విచారణ చేస్తున్న పోలీసులు



జశ్వంత్ హెచ్‌ఫర్‌మార్ (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లాలోని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న అధికారి జశ్వంత్ హెచ్ ఫర్‌మార్ (57) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-1లో నిర్మితమవుతున్న 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్-2లోని బాయిలర్ వద్ద రెండోషిఫ్టు విధులు నిర్వహిస్తుండగా జశ్వంత్ ప్రమాదవశాత్తు 30 మీటర్ల ఎత్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందించేలోపే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. జశ్వంత్ గుజరాత్‌లోని గ్యాస్ ప్రాజెక్టు నుంచి ఇటీవల ఎగ్జిక్యూటివ్ పదోన్నతిపై ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధుల్లో చేరారు. ఆస్పత్రిలోని మృతదేహాన్ని ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య వర్ష, కుమారుడు వాసు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై జీవన్ వెల్లడించారు.

రేపటి నుంచే 'ఆకాశవాణి' ప్రసారాలు

- వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- 15 కిలోమీటర్ల మేర రిలే కేంద్రం ద్వారా ప్రసారాలు
- ఆకాశవాణి సంచాలకులు ఎన్.మణిమంజరి దేవి



ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఆకాశవాణి రిలే కేంద్రం

జ్యోతినగర్: ప్రసారభారతి ఆకాశవాణి (ఎఫ్ఎం) రిలే కేంద్రాన్ని ఈనెల 28న ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లో 100 వాట్ల రేడియో కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభిస్తారని ఆకాశవాణి సంచాలకులు ఎస్.మణిమంజరిదేవి తెలిపారు. ఆకాశవాణి కార్యక్రమాలు మారుమూల గ్రామాల శ్రోతలకు చేర్చాలనే ఉద్దేశంతో కేంద్ర సమాచార, ప్రసారమంత్రిత్వ శాఖ, ప్రసార భారతి దేశవ్యాప్తంగా 100వాట్ల సామర్థ్యం గల 91రేడియో రిలే కేంద్రాలను నూతనంగా ప్రారంభిస్తోందని, ప్రధాని మోదీ న్యూఢిల్లీ నుంచి 91 రేడియోకేంద్రాలను ఆన్‌లైన్ పద్ధతిలో ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు రామగుండంలో 100 వాట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ఆహ్వానించామని, రచయితలు, కవులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. రామగుండం టీటీఎస్‌లోని ఆకాశవాణి రిలే కేంద్రంలో హైదరాబాద్ కేంద్రంగా ఎఫ్ఎం ప్రసారాలు 15 కిలోమీటర్ల పరిధిలో శ్రోతలు 100.1 ఎంహెచ్‌జెడ్ ద్వారా వినే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా

- మే 24న ఆర్ఎల్‌సీ సమక్షంలో మరోసారి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. బుధవారం హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సునిల్ కుమార్ సాహూ సమక్షంలో జరిగిన చర్చల్లో ఎన్టీపీసీ యాజమాన్యం ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు, యూపీఎల్ అధికారులు పాల్గొన్నారు. కార్మికుల వేతన ఒప్పందంలోని 10 డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. కార్మికులకు చెల్లించే వేతనాలు, ప్రస్తుతం ఉన్న అదనపు భత్యం కంటే రూ.23 వేలకుపైచిలుకు డిమాండ్ పైన రూ.300 మాత్రమే చెల్లించేందుకు యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసింది. కార్మిక సంఘాల ప్రతినిధులు ఆమోదయోగ్యంగా లేదని, గత చర్చల్లో జరిగిన ఒప్పందం ప్రకారం రూ.2,220పై చర్చ జరిగితేనే అంగీకరిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆర్ఎల్‌సీ చర్చలను మే 24కు వాయిదా వేశారు. చర్చల్లో వివిధ యూనియన్ల నాయకులు నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, భూమల్ల చందర్, రాధారపు రాజమల్లయ్య, శ్రీనివాస్, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రైతులు కన్నీరు పెడుతుంటే సంబరాలా..?

- పంట నష్టానికి పరిహారం ఇవ్వండి
- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



ముత్తారంలో పంటలను పరిశీలిస్తున్న గుజ్జుల

పెద్దపల్లిరూరల్: అకాలవర్షాలతో పంటలు నష్టపోయి రైతులు కన్నీరు పెడుతుంటే అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సంబరాల్లో మునిగితేలి విందులు చేసుకోవడమేంటని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. రైతుసంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు.. రైతులు గోసపడుతుంటే ఆదుకోవాలన్న ధ్యాస లేకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు కోతలు పెట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులదేనని పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా అమలు చేస్తే రైతులకు న్యాయం జరిగేదన్నారు. నాయకులు కొంతం శ్రీనివాస్‌రెడ్డి, ఠాకూర్ రాంసింగ్, పిన్నింటి రాజు, పర్శ సమ్మయ్య, జంగ చక్రధర్ రెడ్డి, ఫహీం, ఓదెలు, రమేశ్, మల్లారెడ్డి, క్రాంతి, తిరుమల్, మల్లేశం, శ్రీనివాస్ తదితరులున్నారు. ముందుగా అకాల వర్షాలతో నష్టపోయిన మండలంలోని ముత్తారం, గౌరెడ్డిపేట గ్రామాల్లో పర్యటించారు. నేలవాలిన వరి పొలాలను పరిశీలించారు.

క్లుప్తంగా

క్రీడాకారుడిని అభినందించిన మంత్రి



విశాల్‌ను అభినందిస్తున్న మంత్రి సత్యవతి

ఎలిగేడు: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన ఫస్ట్ తెలంగాణ గురుకులం ఆల్‌ఇండియా ఫిడే రేటింగ్ చదరంగం టోర్నమెంట్ ఆడుతున్న ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపల్లి విశాల్‌ను తెలంగాణశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అభినందించారు.టోర్నీలో ఉత్తమక్రీడాప్రతిభ కనబరచి, మొదటిస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

అవ్వ కళ్లు.. ఇద్దరికి వెలుగు



ఓదెమ్మ (ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని పరశురాంనగర్‌కు చెందిన మిట్టపల్లి ఓదెమ్మ (70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేస్తే, ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులకు మృతురాలి అలుడు, సదాశయ ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి అవగాహన కల్పించారు. దీంతో స్పందించిన కుటుంబ సభ్యులు నేత్రాలను దానంచేయడానికి ముందుకు రాగా, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్.లింగమూర్తి, ఉపాధ్యక్షుడు రాజమౌళి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరీఫ్ ద్వారా నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. నేత్రదాత భర్త రాయలింగు, కొడుకులు శ్రీనివాస్, అశోక్, కూతుళ్లు రాజేశ్వరి, సుగుణ, వనిత, సువర్ణను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.శ్రవణ్ కుమార్, సలహాదారులు నూక రమేశ్ కే.ఎస్.వాసు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ అభినందించారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి



ధూళికట్టలో చనిపోయిన గొర్రెలు

ఎలిగేడు(పెద్దపల్లి): ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలోని కాల్వ మల్లయ్య గొర్రెలపాకలో మందపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఆరుగొర్రెలు మృతి చెందాయి. మరికొన్ని గాయపడ్డాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారుగా రూ.60వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. గతంలోనూ పలువురి గొర్ల మందలపై కుక్కలు దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. సర్పంచ్ గొల్లె కావేరి, వెటర్నరీ వైద్యురాలు ఝాన్సీ మృతి చెందిన గొర్రెలను పరిశీలిచారు. కుక్కల దాడిలో గాయపడిన గొర్రెలకు మెరుగైన వైద్యం అందించి, మృతి చెందిన గొర్రెలకు ఇన్సూరెన్స్ ఇప్పించాలని సర్పంచ్ కావేరి వెటర్నరీ వైద్యురాలు ఝాన్సీని కోరారు.

సింగరేణి పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

గోదావరిఖని: స్థానిక సెక్టార్–2 సింగరేణి పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఒకటో తరగతి అడ్మిషన్లు ప్రారంభించామని, ఆసక్తి ఉన్న సింగరేణి ఉద్యోగులు, కార్మికేతరులు అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

33 స్టేషన్లు.. 10 బోగీలు

- కనిపించని 30 బోగీల ప్రయాణం
- బోగీలు సరిపడక ప్రయాణికుల ఇబ్బందులు
- కిక్కిరిసి ప్రయాణిస్తున్న 'సింగరేణి'



సింగరేణి రైలు

ఓదెల(పెద్దపల్లి): నలభై ఏళ్లక్రితం సింగరేణి కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సింగరేణి రైలు 33 రైల్వే స్టేషన్ల ప్రయాణికులను 10 బోగీలతో గమ్యస్థానాలకు చేర్చుతోంది. నాడు 30బోగీలతో భద్రాచలం నుంచి బల్లార్షా వరకు నడిచేది. కోవిడ్ అనంతరం కేవలం 10 బోగీల ద్వారా నడుస్తోంది. సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలో ఏర్పాటు చేయడంతో అప్పటి రైల్వేశాఖమంత్రి 40ఏళ్ల క్రితం ప్రత్యేకంగా కార్మికుల కోసం సింగరేణి రైలును ప్రారంభించారు. నిత్యం భద్రాచలం రోడ్‌నుంచి బల్లార్షా వరకు లక్షమంది ప్రయాణంచేసే సింగరేణి రైలుపై ప్రస్తుతం అధికార్లు శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. సరిపడా బోగీలు ఏర్పాటుచేయకపోవడంతో సింగరేణి కార్మికులు వందల కిలోమీటర్ల దూరం నిలబడాల్సి వస్తోందని వాపోతున్నారు. కొత్తగూడెం నుంచి వరంగల్ మీదుగా రామగుండం, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, బల్లార్షా వరకు సింగరేణి కార్మికులను గమ్యం చేర్చే సింగరేణి రైలు బోగీలలో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూర్చోవడానికి సరిపడే సీట్లు లేక నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేవు. 30బోగీలతో సింగరేణి రైలును తిరిగి నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సరిపోతలేవు



భద్రాచలం నుంచి బల్లార్షా మధ్యలో నడిచే సింగరేణి రైలు సీతమ్మ జెడ వలే ఉండేది. ప్రస్తుతం 10బోగీలతో ఎటూ ప్రయాణికులకు సరిపోకుండా మారింది. సౌకర్యాలు తగ్గటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

– సూత్రాల శ్రావణ్, ప్రయాణికుడు

బోగీలు పెంచాలి



సింగరేణి రైలులో ప్రయాణికులకు సరి పడా బోగీలను పెంచాలి. ప్రస్తుతం తక్కువ సంఖ్యలో బోగీలు ఉండటంతో కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రయాణం చేయాల్సి వస్తోంది. అధికారులు ప్రయాణికుల సౌకార్యాలతో పాటు బోగీలు పెంచాలి.

– పల్లె సుధాకర్, ప్రయాణికుడు

సౌకర్యాలు లేవు



ప్రయాణికులకు సరిపడే సౌకర్యాలను సింగరేణి రైలులో పెంచాలి. బోగీలు సరిపోకపోవటంతో ప్రయాణికులు ఒంటికాలి మీద ప్రయాణం చేస్తున్నారు. పండుగలకు కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్లే సింగరేణి రైలునుంచి కిందపడి గాయపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

– భాగ్యనగర్ నాగరాజు, ప్రయాణికుడు

విచ్చలవిడిగా ఏసీల వినియోగంపై మేయర్ అభ్యంతరం

- ఏసీలకు బదులు కూలర్లను ఉపయోగించుకోండి
- వెంటనే ఏసీలను అన్‌ఇన్‌స్టాల్ చేయాలని ఆదేశం
- అధికారులకు నోటీసు జారీ చేసిన బల్దియా మేయర్

సాక్షి స్పందన

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ కేబుళ్ల సామర్థ్యానికి మించి విచ్చలవిడిగా ఏసీలను ఏర్పాటు చేస్తుండటంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం పొంచి ఉందంటూ 'అదే నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం..!' శీర్షికను ఈనెల 23న 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ కథనానికి నగర మేయర్ బి.అనిల్‌కుమార్ స్పందించారు. బల్దియా ఆఫీసులో మేయర్, కమిషనర్ చాంబర్లు కాకుండా కొత్త ప్రదేశాలలో కొత్త ఏసీలను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. వైరింగ్ సిస్టమ్ ఏ మేరకు భారాన్ని మోయగలదనే అంశాన్ని పరిగణంలోకి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కేబులింగ్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయకుండా కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏసీలు పనిచేయడం ద్వారా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, కార్పొరేటర్ చాంబర్లు మినహా మిగితా అన్ని ఏసీలను వెంటనే అన్‌ఇన్‌స్టాల్ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ షార్ట్ సర్క్యూట్లను నివారించడానికి వైరింగ్ సిస్టమ్‌ను కూడా అప్‌గ్రేడ్ చేసేంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్‌తోపాటు సంబంధిత ఇంజనీర్లకు మేయర్ నోటీసులను జారీ చేశారు. ఏసీల స్థానంలో ఎయిర్‌కూలర్లను ఉపయోగించాలని మేయర్ సూచించారు. మేయర్ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణించాల్సి వస్తుందని ఆయన నోటీసులో పేర్కొన్నారు.

ప్రతి రైతుకూ పరిహారం అందించాలి



పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం మంచిరామి గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షాలతో సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగిందన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళనాలు పెట్టి విలాసలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్‌రావు, సత్యనారాయణ, సంపత్, లింగయ్య, తిరుపతి, రమేశ్, మధునయ్య, ఐలయ్య తదితరులున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

జూలపల్లి: పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ కోరారు. మండలకేంద్రంతోపాటు వడ్కాపూర్‌లో మొక్కజొన్న, వరి, మామిడి, మిర్చి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఆయన వెంట రావుల రాంనాథ్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, తంగెడ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

గోదావరిఖని: తమ తప్పుడు విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. బుధవారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. మేనెలలో జరిగే వేజ్‌బోర్డు సమావేశంలో మెరుగైన ఒప్పందం కోసం కృషి చేస్తామన్నారు. సింగరేణికి రావల్సిన రూ.29వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం ఇష్టం లేకపోతే అన్ని కార్మిక సంఘాలతో కార్మికుల సమస్యలపై సంప్రదింపులు జరపాలన్నారు. కార్మికులు కష్టపడి బొగ్గు ఉత్పత్తి చేసి సంస్థను లాభాల్లోకి తీసుకువస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్థ ను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థకు చెందిన కోట్లాది రూపాయలను స్కీంల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు దోచిపెడుతూ సంస్థను నష్టాల ఊబిలోకి నెట్టిందన్నారు. సంస్థకు చెందిన బొగ్గును, జైపూర్ పవర్ ప్లాంట్ విద్యుత్‌కు వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన రూ.29వేల కోట్లను ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఈవిషయంలో గుర్తింపు సంఘం నోరు మెదపడం లేదన్నారు. సింగరేణి కార్మికుల జీతాల చెల్లింపు కోసం యాజమాన్యం ప్రతి నెలా అప్పులు చేయాల్సి వస్తుందని ఆరోపించారు. సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అజమాయిషీ చేయడం వల్ల సంస్థ దివాలా తీసే పరిస్థితి చేరుకుందన్నారు. వచ్చే నెలలో జరిగే వేజ్ బోర్డు సమావేశంలో అలవెన్సులు, రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేసి, మెరుగైన ఒప్పందం చేసుకోవాలని చూస్తున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటు వారికి ఇవ్వమని చెప్పి, టెండర్లు పిలిచి సింగరేణి కార్మికులను మోసం చేసిందన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఆరెల్లి పోచం, సంకె అశోక్, బాలయ్య, కలవేణి రాజేశ్, మానాల శ్రీనివాస్, మహేందర్, మల్లికార్జున్, వొల్లాల మల్లయ్య, తొడుపునూరి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తికి విఘాతం లేకుండా చర్యలు తీసుకోవాలి

- డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: అకాల వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం లేకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదేశించారు. సర్వే మ్యాప్ ద్వారా పని స్థలాలను పరిశీలించి ఉత్పత్తి ఉత్పాదకత వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆర్జీ–2 ఏరియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. వకీల్‌పల్లి భూగర్భగని అధికారులతో వేర్వేరుగా సమావేశమై గనికి కేటాయించిన లక్ష్యాలు అందుకు చేపట్టవల్సిన ప్రణాళికలు తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. నిర్దేశిత లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఓసీపీ–3 సర్వే అధికారి చంద్రమౌళి, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, సురేష్‌బాబు, సీనియర్ సెక్యూరిటీ అధికారి పివి.రమణ తదితరులు ఉన్నారు.

పర్సనల్ రికార్డులు క్లియర్‌గా ఉండాలి

- డైరెక్టర్(పా) బలరాం ఆదేశం



మాట్లాడుతున్న ఆర్జీ–2 జీఎం మనోహర్

గోదావరిఖని: ఉద్యోగుల పర్సనల్ రికార్డులు ఎప్పటికప్పుడు క్లియర్‌గా ఉండాలని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాం ఆదేశించారు. బుధవారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దీనిలో భాగంగా ఆర్జీ–1, ఆర్జీ–2 ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం జరిపారు. ఏరియాలో సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డ్‌లకు సంబంధించిన పెండింగ్ కేసులు వివరాలు, పదోన్నతులు, బదిలీలు, విధులకు గైర్హాజర్, సీఎంపీఎఫ్ నామినేషన్స్, టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియమకాలు, క్వార్టర్ అలాట్‌మెంట్ తదితర వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులపై పర్సనల్ చర్యలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇన్‌చార్జ్ జీఎం సైదులు, పర్సనల్ డీజీఎం లక్ష్మీనారాయణ, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రయాణికుల సూచనలు పరిగణలోకి తీసుకుంటాం



శ్రీనివాస్

మంథని: ప్రయాణికుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపుతామని ఆర్టీసీ మంథని డిపో మేనేజర్ టి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొని ప్రయాణికుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ముత్తారం నుంచి ఉదయం, సాయంత్రం వేళలో బస్సు నడిపించాలని కోరగా సాధ్యాసాధ్యాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మంథని బస్టాండ్ నుంచి ఉదయం నాలుగు గంటలకు బదులు ఐదు గంటలకు ఎంజీబీఎస్‌కు బస్సు నడిపించాలని కోరగా పరిశీలిస్తామన్నారు. బస్టాండ్‌లో అనౌన్స్‌మెంట్ సరిగ్గా చేయడం లేదని ఫిర్యాదు చేయగా.. చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేడేను ఘనంగా జరుపుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



వినతిపత్రం ఇస్తున్న ముత్యంరావు

సుల్తానాబాద్: మేడేను కార్మికులు, కర్షకులు, శ్రామికవర్గం ఘనంగా జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మేడే సందర్భంగా రైస్‌మిల్ ఆపరేటర్లు, గుమస్తాలకు సెలవుదినం ప్రకటించాలని బుధవారం మండలకేంద్రంలోని పూసాల రైస్‌మిల్ అసోసియేషన్‌లో రైస్‌మిల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు చీటీ కేశవరావుకు వినతి పత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మే 1నుంచి 6వరకు జిల్లాలో మేడే వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని కార్మికులందరూ కుటుంబసమేతంగా హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైస్‌మిల్ గుమస్తాల సంఘం గౌరవ అధ్యక్షుడు పురం హరికిషన్, అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, జాకీర్, భగవాన్, శంకర్, బాలు, శ్రీధర్, వేగోళపు అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రీ విద్యాసంస్థల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణంలోని గాయత్రీ విద్యాసంస్థల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, రాష్ట్ర కో–ఆర్డినేటర్ సత్యనారాయణ హాజరయ్యారు. ఉన్న చోటనే మంచి విద్యావ్యవస్థను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ రజనీశ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



పాపను అప్పగించిన కానిస్టేబుల్ ప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాకేంద్రంలోని కమాన్ వద్ద బుధవారం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు తప్పిపోయిన పాప కనిపించింది. ఒంటరిగా హైవే దాటుతున్న చిన్నారిని గమనించి ఆమె గురించి ఆరా తీశాడు. ఆమె చేతిల ఓ ఫోన్ ఉండగా.. ఫోన్‌ను పరిశీలించాడు. ఫోన్‌కు వచ్చిన మిస్‌కాల్ ఆధారంగా బండారుకుంట వద్దకు పనికి వెళ్లిన చిన్నారి తండ్రిని పిలిచి అప్పగించాడు. తమపాపను సురక్షితంగా అప్పగించిన కానిస్టేబుల్‌కు ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని సంఘాలను చర్చలకు పిలవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని సంఘాలను చర్చలకు పిలవాలని బుధవారం జీడీకే–5ఓసీపీలో ప్రాజెక్టు మేనేజర్ గబాలకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరేళ్లు గడుస్తున్నా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. కాలపరిమితి అయిపోయినటువంటి టీబీజీకేఎస్‌కు అనధికార గుర్తింపునిచ్చి, మిగతా యూనియన్లకు కార్మికుల సమస్యలపై మాట్లాడే కనీస హక్కును కూడా నిరాకరిస్తుందని ఆరోపించారు. కంపెనీస్థాయిలో నిర్వహించే అన్ని అధికారిక కార్యక్రమాల్లో గుర్తింపు సంఘంతో పాటు అన్ని కార్మిక సంఘాలను చర్చలకు పిలవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నుంచి మాదన మహేశ్, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి, సీఐటీయూ నుంచి ఎస్‌కేగౌస్ ఐఎన్‌టీయూసీ నుంచి సదానందం, సాగర్, దేవేంద్రచారి, హెచ్‌ఎంఎస్ నుంచి గౌర్‌బేగ్, ఖయ్యాం, బీఎంఎస్ నుంచి శ్రీనివాస్, వెంకటేశ్‌తో పాటు ఓసీపీ–5 కార్మికులు పాల్గొన్నారు.

ఒకే రోజు రెండు పరీక్షలు..!



మహాత్మా జ్యోతిరావు పూలే పరీక్ష పెద్దపల్లి కేంద్రంలో..



అదే విద్యార్థికి ట్రైబల్ వెల్ఫేర్ పరీక్ష సిరిసిల్లలో..

యైటింక్లయిన్‌కాలనీ: ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు నిర్వహిస్తున్న అర్హత పరీక్షలు ఒకేరోజు రెండు పెట్టడం ద్వారా విద్యార్థులు నష్టపోయే అవకాశముంది. ఈనెల 30న మహాత్మాజ్యోతిరావు పూలే కళాశాలలో ప్రవేశాలకు, అదేరోజు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్‌లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సదరు పరీక్ష కేంద్రాలు వేర్వేరు జిల్లాలో వేయడంతో చాలామంది నష్టపోయే అవకాశముంది. దూరప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పరీక్ష తేదీలనైనా.. లేదా పరీక్ష కేంద్రాలనైనా మార్చాలని కోరుతున్నారు. మరోవైపు దరఖాస్తు చేసుకునే సమయంలో జ్యోతిరావు పూలే కళాశాల ప్రవేశ పరీక్ష ఈనెల 29న అని ఉంది.తరువాత తేదీని మార్చినట్లు చెబుతున్నారు.

విధుల్లోకి 188 మంది ఆర్టిజన్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో 189 మంది ఆర్టిజన్లు పనిచేస్తుండగా.. బుధవారం 188 మంది విధుల్లో పాల్గొన్నారని ఎస్‌ఈ సుదర్శన్ తెలిపారు. పీఆర్సీ పెంచాలని డిమాండ్ చేస్తూ ఆర్టిజన్ సిబ్బంది బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే వారికి వ్యక్తిగతంగా కౌన్సెలింగ్ చేసి భవిష్యత్తు కార్యాచరణ, వేతన పెంపుదల, సర్వీస్ కండిషన్స్ మెరుగుదల వివరించామని తెలిపారు. దీంతో సర్కిల్ పరిధిలో 188 మంది సమ్మెకు వెళ్లకుండా విధుల్లోకి వెళ్లారని పేర్కొన్నారు. సయ్యద్ కబీమొద్దీన్ కంపెనీ ఆదేశాలకు విరుద్ధంగా సమ్మెలో పాల్గొన్నాడనే కారణంతో ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపారు.

పోరుయాత్ర జయప్రదం చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న శంకర్

సుల్తానాబాద్: వామపక్ష భావాలు కలిగిన ప్రతి ఒక్కరూ కదిలివచ్చి సీపీఐ పోరుయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ కోరారు. బుధవారం సుల్తానాబాద్ పట్టణంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసే బహిరంగ సభస్థలాన్ని పరిశీలించారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ మార్కెట్‌రోడ్‌లో ముగింపు బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూనే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ పోరుయాత్రను సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ బహిరంగసభకు సీపీఐ జాతీయ సమితి నాయకుడు చాడ వెంకట్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కడారి సునీల్, కార్యదర్శి పసుల మల్లారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కొమురయ్య, రాజేశ్, అశోక్, మల్లేశ్‌రెడ్డి, సదయ్య, పోల్ దాసరి లచ్చయ్య, రవి పాల్గొన్నారు.